3

నేడు బిసిల బంద్‌కు అంతా సిద్ధం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బిసి సంఘాల సమాయత్తం

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్‌కు డిమాండ్

మద్దుతు తెలిపిన కాంగ్రెస్, బిజెపి

వికారాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బిసి సంఘాల నేతలు

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

4

శ్రీబుగ్గ జాతరకు రూ. 30 లక్షలు మంజూరు

ఆఖరి ఆశలు

వికారాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త : వైన్స్ షాపుల టెండరు నోటిఫికేషన్ వస్తే చాలు..వ్యాపారులు, యువతలో ఎంతో ఉత్సాహంగా దరఖాస్తులు వేసేందుకు ముందుకు వచ్చేవారు. ఏ హోటళ్లో చూసినా వైన్స్ టెండర్ పైనే చర్చ జరిగేది. ఎక్సైజ్ అధికారులు సైతం దరఖాస్తు చివరి తేదీ వరకు భోజనం చేసే తీరిక లేకుండా విధులు నిర్వహించే వారు. ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం దరఖాస్తులు ఆశించిన స్థాయిలో రాక..దరఖాస్తులు చేసుకోవాలని ఎక్సైజ్ అధికారులు వ్యాపారులను కలిసి బ్రతిమాలుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. గతంతో పోల్చితే 25 శాతం కూడా దరఖాస్తులు రాలేవంటూ ఉన్నతస్థాయి అధికారులు క్రిందిస్థాయి అధికారులకు మొట్టికాయలు వేస్తున్నారు. దీంతో ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగి గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి మెసేజ్‌లు పెట్టడం, ఫోన్‌లు చేయడం వంటివి చేస్తున్నారు. కొంతమంది బడా వ్యాపారులను కలిసి మద్యం టెండరుకు దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థిస్తున్నారు. ఇంత చేసిన వైన్స్ షాపు టెండరు దరఖాస్తు చేసుకునేందుకు మాత్రం వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. దీనికి కారణాలు అనేకం ఉన్నాయి. గతంలో మద్యం దుకాణం టెండరు దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు ఉండేది. ప్రస్తుతం ఈ ఫీజును రూ.3 లక్షలకు ప్రభుత్వం పెంచింది. రియల్ ఎస్టేట్ ప్రభావం సైతం మద్యం దుకాణ దరఖాస్తులపై పడిందని పలువురు అధికారులు అభిప్రాయపడుతున్నారు. గతంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు మాత్రం ఎక్సైజ్ అధికారుల తీరు వల్లే దరఖాస్తులు చేసుకోలేకపోతున్నామని బాహాటంగా చెపుతున్నారు. గతంలో తాము వైన్స్ షాపు దక్కించుకున్నా..ఆశించిన స్థాయిలో లాభాలు గడించలేదని, వచ్చిన లాభాల్లో సగం వరకు అధికారులకు మామూళ్ల రూపంలో ఇవ్వాల్సి వచ్చిందని ఆరోపిస్తున్నారు. అందుకే ఈసారి మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకోవడం లేదని మద్యం వ్యాపారులు పేర్కొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 59 మద్యం దుకాణాలకు గాను ఇప్పటి వరకు 839 దరఖాస్తులు వచ్చినట్లు

మిగతా 2లో

నేటితో ముగియనున్న వైన్‌షాపుల దరఖాస్తు ప్రక్రియ

ఇప్పటి వరకు వచ్చినవి 839 మాత్రమే

గత ఏడాది కంటే 75 శాతం తక్కువ

ఎక్సైజ్ అధికారులు చేసిన ప్రయత్నాలన్నీ వృథా

ఎంత బతిమలాడినా స్పందించని వ్యాపారులు

చివరి రోజు ఊపందుకుంటుందని ధీమా

సొమ్ము సోకు

షాద్‌నగర్ నియోజకవర్గంలో భూదాన్ స్ఫూర్తికి తూట్లు

ఒకరిది

రూ.20 కోట్ల భూములు స్వాహాచేసిన రియల్టర్లు

అధికారుల అండతో రికార్డులు తారుమారు

షాద్‌నగర్, అక్టోబరు 17, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలో కొంతమంది అధికారులు అత్త సొమ్ము అల్లుడు దానం చేసిన చందంగా వ్యవహరించారు. భూమి లేని నిరుపేద రైతులకు బాసటగా నిలవాలన్న ఉన్నత ఆశయంతో ఆచార్య వినోబాబావే చేపట్టిన భూదాన్ ఉద్యమ స్ఫూర్తికి తూట్లు పొడిచారు. ఫలితంగా భూమి లేని నిరుపేదలకు దక్కాల్సిన భూదాన్ భూములు బడాబాబుల చేతుల్లో బందీ అయ్యాయి. కోట్లు విలువ చేసే భూములను భూబకాసురులు అనుభవిస్తున్నారు. రికార్డులు తారుమారు చేసి ఒకరి నుంచి మరొకరికి పట్టాలు మార్చి ఏమార్చారు. అసైన్‌మెంట్ భూములను వారసత్వంగా అనుభవించవచ్చు.. కానీ, అమ్మడానికి వీలు లేదు. అయితే ఇక్కడ నిబంధనలు విరుద్ధంగా బడాబాబుల ఆధీనంలోకి వెళ్లాయి. రికార్డులను చెరిపి ఒకరి, ఇద్దరి పేర్లపై మార్పిడి చేసి బడాబాబులు దక్కించుకున్నారు.

షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామంలో వెలుగుచూసిన ఈ ఉదంతం వివరాలిలా ఉన్నాయి. సర్వే నెంబరు 189 నందు రాంరెడ్డి అనే భూస్వామికి 11 ఎకరాల 36 గుంటల పట్టా భూమి ఉండేది. భూమి లేని పేదలకోసం ఆచార్య వినోబాబావే పిలుపుమేరకు భూదాన్ ఉద్యమానికి రాంరెడ్డి ఆకర్షితులయ్యారు. తన భూమి మొత్తాన్ని భూదాన్ బోర్డుకు అప్పజెప్పారు. 1964 మార్చి 17న భూదాన్ బోర్డు ఈ భూమిని గ్రామంలోని ఈడిగ రామయ్యతో పాటు మరో ఇద్దరు నిరుపేదలకు రైతులకు కేటాయించింది. అప్పటి నుండి రైతులు భూదాన్ ద్వారా సంక్రమించిన భూముల్లో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తూవచ్చారు. కాల క్రమేణా ఆ భూములు వంశపారపర్యంగా వారి వారసుల పేర్లకి బదిలీ అయ్యాయి.

ఆ తర్వాతి కాలంలో భూముల ధరలు కోట్లకు పడగలెత్తాయి. ఈ నేపథ్యంలోనే స్థానికంగా కొందరు రియల్టర్ల కన్ను పేద రైతుల చేతిలో ఉన్న భూదాన్ భూములపై పడింది. సబ్ రిజిస్ట్రార్‌తోపాటు రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ఆ భూములను రికార్డులలో దర్జాగా వారి పేరిట రిజిస్టర్ చేయించుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా ఈ బదలాయింపులు జరిగిపోయాయి.

భూదాన్ భూములంటే...

ఆచార్య వినోబాబావే 1951లో ఇచ్చి పిలుపుతో భూస్వాములు, ధనవంతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వినోబాబావేకు ఇచ్చిన భూములే భూదాన్ భూములు. భూదాన్ భూములను అమ్ముకోవడానికి అర్హత ఉండదు. తరతరాలుగా ఆయా భూములను అనుభవించే హక్కు మాత్రమే ఉంటుందని చట్టం చెబుతోంది.

నిషేధిత జాబితాలో ఉన్నా..

ఫరూఖ్ నగర్ మండలంలోని దూసకల్ గ్రామంలో గల 189 సర్వే నెంబరు భూములు నిషేదిత జాబితాలో ఉన్నప్పటికి అధికారులు రిజిస్టర్ చేయడం విడ్డూరకరమైన విషయం. ఏకంగా ఐజిఆర్ఎస్ పోర్టల్లోనే నిషేధిత భూములుగా నమోదయిప్పటికి 2015 నుండి 2019 వరకు రిజిస్ట్రేషన్లు, ఏజిపిఏలు చేస్తూనే వచ్చారంటే పరిస్థితి ఎలా తయారయ్యిందో అర్థం చేసుకోవచ్చు.

కబ్జా చేసి.. చుట్టూ ప్రహరీ కట్టి..

ఓ రియల్ వెంచర్ యాజమాన్యం ఈ భూములపై కన్నేసి పథకం ప్రకారం వాటిని రిజిస్టర్ చేసుకోవడమే కాకుండా భూమి చుట్టూ రేకులతో భారీ ప్రహరీని ఏర్పాటు చేశారు. అధికారుల అండతో రిజిస్టర్ చేసుకున్న భూదాన్ భూములను రెవెన్యూ రికార్డుల్లో కాలక్రమేణా పట్టా భూములుగా నమోదు చేస్తూ వచ్చారు. అలా రికార్డులు మార్చి యథేచ్ఛగా క్రయ విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఎకరం రూ.2 కోట్లు పైమాటే!

ఈ తంతంగం అంతా కింది స్థాయి రెవెన్యూ యంత్రాంగానికి తెలిసినప్పటికి నోరు మెదపకపోవడం వెనక అంతర్యం ఏమిటనే ప్రశ్నలు వెల్లడవుతున్నాయి. అన్యాక్రాంతమైన భూమి విలువ ప్రస్తుతం భహిరంగ మార్కెట్లో ఎకరానికి సుమారు రూ.2 కోట్లకు పైగా ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది. ఈ తరహాలో సువరు 20 కోట్ల రూపాయల భూమిని అప్పనంగా హస్తగతం చేసుకోవటమే కాకుండా.. భూ విక్రయాల ద్వారా సొమ్ము చేసుకున్నారు. రియల్టర్లు సదరు భూమి చుట్టూ ఇటీవలే ఎవరూ రాకుండా రేకులతో బౌండరీ ఏర్పాటు చేశారు.

విచారణలో నిగ్గుతేలినా..

ఈ భూములు అన్యాక్రాంతం అయిన

మిగతా 2లో

వినోబాబావే పిలుపుతో నాడు స్పందించిన భాస్వాములు

భూదాన్ బోర్డుకు పెద్దఎత్తున భూములు అప్పగింత

దూసకల్‌లో 11.36 ఎకరాల భూమిని ఇద్దరు నిరుపేద రైతులకు స్వాధీనం

వారసత్వంగా అనుభవించమే కానీ..అమ్మడానికి వీలు లేదని షరతులు

నిబంధనలకు పాతరవేసిన అక్రమార్కులు నిస్సహాయ స్థితిలో బాధిత రైతులు

అన్యాక్రాంతానికి గురైన భూదాన్ భూమి ఇదే



ఐజిఆర్ఎస్‌లో నిషేధిత జాబితా

హోంవర్క్ చేయలేదని చితకొట్టుడు!

టీచర్ కొట్టటంతో విద్యార్థి శరీరంపై గాయాల దృశ్యం

బాధిత విద్యార్థికి గాయాలు

ప్రైవేట్ పాఠశాలలో మహిళా టీచర్ నిర్వాకంపై తల్లిదండ్రుల ఆగ్రహం

శామీర్‌పేట, అక్టోబరు 17, ప్రభాతవార్త : ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన ఓ మహిళా టీచర్ ఉదంతం స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన శామీర్‌పేట మండల పరిధిలోని ఉద్దెమర్రిలో చోటుచేసుకుంది. ఉద్దెమర్రి గ్రామ సమీపంలో ఉన్న గుడ్‌షెఫర్డ్ స్కూల్‌లో ఉద్దెమర్రి గ్రామానికి చెందిన విద్యార్థి ఎం.మహేశ్‌బాబు 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం హోంవర్క్ చేయలేదన్న కారణంతో బయోలాజి సబ్జెక్టు బోధించే మహిళా ఉపాధ్యాయురాలు శోభారాణి విచక్షణా రహితంగ కర్రతో కొట్టిందని బాధిత విద్యార్థి తెలిపారు. తీవ్రంగా గాయాలపాలవడంతోపాటు చర్మం అక్కడక్కడ కమిలిపోయినట్లు తెలిపాడు. ఈ సంఘటనపై ఆగ్రహోద్యుక్తులైన తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాలకు వెళ్లారు. టీచరు ప్రవర్తనపై నిలదీయటానికి ప్రయత్నించగా ఆమె విధులకు రాలేదు. ఈ విషయంపై మూడుచింతలపల్లి మండల విద్యా అధికారిణి భాగ్యమణికి ఫిర్యాదు చేశామని విద్యార్థి తల్లిదండ్రులు చెప్పారు. విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

పరిగి ఫారెస్ట్ ఆఫీసులో

అవినీతి తిమింగలాలు

పరిగి రూరల్, అక్టోబరు 17, ప్రభాతవార్త : పరిగి పట్టణ కేంద్రంలో ఫారెస్ట్ కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. అటవీశాఖ సెక్షన్ అధికారుల అవినీతి లంచాల పర్వం ఎట్టకేలకు బయటపడింది. వివరాల్లోకి వెళ్ళితే..పరిగిలో వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి సీతాఫలం వ్యాపారం నిమిత్తం టెండర్లలో పాల్గొన్నాడు. మూడు మండలాలకు కలిపి సుమారు 18 లక్షలు డిడి చెల్లించాలని తెలిపారు. కానీ సీతాఫలాలు పర్మిట్ రూపంలో లారీలలో, డీసీఎంలో ఎగుమతి దిగుమతి కోసం పర్మిట్ ఇవ్వడానికి అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ మహమ్మద్ మొయి నోద్దీన్, సాయికుమార్ లు వ్యాపారి దగ్గర రూ.50 వేలు లంచం డిమాండ్ చేశారు. అంత ఇవ్వలే నని సదరు వ్యాపారి బదులిచ్చాడు. డ్రైవర్ బాలకృష్ణతో రూ.40 వేలు బేరం కుదుర్చుకుని శుక్రవారం రూ.40 వేలు ఇస్తుండగా ఏసీబీ రంగారెడ్డి డి.ఎస్.పి ఆనంద్ కుమార్ పట్టుకున్నారు. ఈ మేరకు నింధితులను ఏసీబీ కోర్టు హాజరుపర్చనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఈ మధ్యకాలంలో ప్రభుత్వ అధికారులు ఒకవైపు జీతాలు తీసుకుంటూనే లంచాలకు ఆశపడుతున్నారు. ప్రతి చిన్న పనికి లంచం ఇవ్వనిదే అధికారులతో ప నులు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అన్ని సక్రమంగా ఉన్నప్పటికీ కావాలని లంచాలు డి మాండ్ చేస్తున్న ప్రభుత్వాధికారులపై సామా న్యులు ఏసీబీకి సమాచారం అందిస్తున్నారు. ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించటంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

చేయి తడిపితేనే పర్మిట్

సీతాఫలం వ్యాపారి నుంచి రూ.40 వేలు లంచం డిమాండ్

వలవేసి ఇద్దరు రేంజ్ ఆఫీసర్లను అదుపులోకి తీసుకున్న ఎసిబి అధికారులు

ఎసిబికి పట్టుబడ్డ రేంజ్ అధికారులు

14 మంది కూలీలకు తప్పిన పెను ముప్పు

పత్తి తీత పనులకు బొలెరోలో వెళుతున్న కార్మికులు

స్టీరింగ్ బోల్ట్ ఊడిపోయి అదుపుతప్పిన వాహనం

ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు ఢీ

రెండు వాహనాలూ పూర్తిగా ధ్వంసం

క్షేమంగా బయటపడిన కూలీలు

నుజ్జు నుజ్జు అయిన ఆర్టీసి బస్సు

కేశంపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త : ఆర్టీసీ బస్సును బొలెరో వాహనం ఢీకొన్న ఘటన కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కేశంపేట మండలంలోని దత్తాయపల్లి గ్రామానికి చెందిన 14 మంది కూలీలు జడ్చర్ల మండలం చిన్నఆదిరాలలో పత్తి తీసేందుకు బొలెరో వాహనంలో వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో మహేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాణిపేట నుండి అప్జల్ గంజ్‌కి బయలుదేరింది. తొమ్మిదిరేకుల గ్రామ సమీపంలోకి రాగానే బొలెరో వాహనం స్టీరింగ్ బోల్ట్ ఊడిపోయి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. బొలెరో వాహనానికి ఆర్టిసి బస్సు అడ్డుగా ఉండడంతో కూలీలు కాలువలో పడిపోయే ప్రమాదం తప్పిందని తొమ్మిదిరేకులకు చెందిన బిజెపి యువ నాయకుడు కల్వకోలు తిరుపతి తెలిపారు. ప్రమాదంలో రెండు వాహనాల ముందు భాగం పూర్తిగా దెబ్బతినగా ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. గత 15 రోజుల క్రితం ఇదే వాహనానికి కేశంపేట కొత్తపేట మార్గమధ్యమంలో పాటిగడ్డ సమీపంలో బొలెరో వాహనం ఢీకొని బస్సులో ప్రయాణిస్తున్న కండక్టర్ ప్రయాణికులకు గాయాలయ్యాయి. అప్పుడు గాయాలు అయిన కండక్టర్ పూర్తిగా కోలుకోకముందే విధుల్లో చేరాడు.

ఇప్పుడు కూడా అదే బస్సులో కండక్టర్ ఆయననే ఉన్నాడు. ప్రమాదానికి కారణమైన బొలెరో వాహనంపై ఆర్టీసీ యాజమాన్యం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేశంపేట సిఐ నరహరి తెలిపారు.

ధ్వంసమైన హనుమాన్ విగ్రహం

రాంపల్లిలో 'రాములోరి' సాక్షిగా..

హనుమాన్ విగ్రహం ధ్వంసం

గ్రామస్తుల ఆందోళనతో ఉద్రిక్తత

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎంపి ఈటల

నింధితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

కీసర, అక్టోబరు17, ప్రభాతవార్త : నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామంలో శ్రీ సీతా రామాంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న హనుమాన్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. దీంతో ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు శుక్రవారంనాడు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఎంపి ఈటల రాజేందర్, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్‌రావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. అనంతనం ఎంపి ఈటల మాట్లాడుతూ విగ్రహాన్ని ధ్వంసం చేయడం ఏ మతందో... కులందో కాదని... ప్రతి హిందువు మీద దాడిగా పరిగణించాలని అన్నారు. హిందూ దేవాలయాలపై ఎవరైనా దాడి చేస్తే సహించేది లేదన్నారు. ఆలయ చైర్మన్ రామారం నర్సింహ్మాగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు కుషాయిగూడ ఏసిపి వెంకట్‌రెడ్డికి విగ్రహాన్ని

మిగతా 2లో

తైక్వాండోలో మహేశ్‌రెడ్డికి గిన్నిస్ రికార్డులు

ఘట్‌కేసర్, అక్టోబరు 17, ప్రభాతవార్త: క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహించాలని ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లోని మాజీ ఎంపిపి నివాసంలో తైక్వాండో క్రీడాకారుడు మహేశ్‌రెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. పీర్జాదీగూడ బుగ్గానగర్‌కు చెందిన మాస్టర్ బొబ్బిలి రెడ్డి (మహేశ్‌రెడ్డి) తైక్వాండో క్రీడలో రెండుసార్లు గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులు సాధించి 20 సంవత్సరాలుగా ఎంతోమంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన మహేశ్‌రెడ్డి సేవలు అభినందనీయమని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 11న పాండిచ్చేరిలో గ్లోబల్ హుమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన గౌరవ డాక్టరేట్ అవార్డుల కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ విభాగంలో దేశంలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఎకైక గౌరవ డాక్టరేట్‌ను మహేశ్‌రెడ్డి అందుకున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు శివారెడ్డి, సాగర్, నాయకులు గట్టుపల్లి మల్లేశ్, మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులు మహేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది

(మొదటి పేజీ తరువాయి)

విషయం గతంలో వెలుగులోనికి రావడంతో అధికారులు క్షేత్ర స్థాయి లో విచారణ చేసి ఉన్నతాధికారులకు ఇవి పూర్తిగా భూధాన్ భూ ములేనని నివేదికలు ఇచ్చారు కూడా. అయినా ఉన్నతాధికారులు మాత్రం ఈ విషయంలో నోరుమెదపకపోవడం పట్ల పలు విమర్శలు వినిపిస్తున్నాయి. కోట్ల విలువైన భూములు పేదలకు చెందకుండా బడాబాబులు ఆక్రమించుకుంటే అధికారులు ఎందుకు చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారనే ప్రశ్నలు వెల్లడవుతున్నాయి. ఇప్పటికైనా అధికా రుల్లో చలనం వస్తుందా లేదా వేచి చూడాలి.

ఆఖరి ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

ఎక్సైజ్ అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో శుక్రవారం ఒక్క రోజే 352 దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తుల గడువు తేదీ శనివారం సాయంత్రంతో ముగియనుండటంతో ఆఖరి రోజున పెద్ద మొత్తంలో దరఖాస్తులు రావచ్చని ఎక్సైజ్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మద్యం దుకాణాల కోసం 2,637 దరఖాస్తులు వచ్చాయి. సెప్టెంబర్ 26న ధరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ శుక్రవారం వరకు కేవలం 839 దరఖాస్తులు మాత్రమే రావడంతో ఎక్సైజ్ అధికారులు కాస్తా విస్తుపోతున్నారు. పైకి గాంభీర్యం ప్రదర్శించినా..లోలోపల మద్యం దరఖాస్తుల ఆహ్వానంపై ఆందోళన చెందుతున్నారు. గతంలో వచ్చిన దరఖాస్తుల్లో సగం వరకైనా దరఖాస్తులు వస్తాయా..లేదా..అనే ఆందోళన ఎక్సైజ్ అధికారుల్లో నెలకొంది. ఏదిఏమైనా.. దరఖా స్తులకు గడువు తేదీ శనివారంతో ముగియనుండటంతో చివరి రోజు ఏ మేరకు దరఖాస్తులు వస్తాయో వేచి చూడాల్సిందే.

రాములోరి సాక్షిగా హనుమాన్ విగ్రహం ధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. విగ్రహం ధ్వంసం చేయడం దురదృష్టకరమని ఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసిపి ఆందోళనకారులను శాంతింపజేశారు. కీసర పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ కంటెస్ట్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు నాగరాజు, మహిళా మోర్చ అధ్యక్షురాలు జ్యోతి పాండే, నాయకులు సురేష్, కిషోర్, రామక్కపేట రవీందర్‌రెడ్డి, క్రిష్ణచారి, సంతోషి, క్రిష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను అరెస్ట్ చేయాలి

అత్తాపూర్ అక్టోబరు 17, ప్రభాతవార్త : మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ, దాడికి పాల్పడ్డ అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్,దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండల తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్యాసారం శంకర్ రావు మాదిగ హాజరై మాట్లాడారు...భారత రాజ్యాంగం మీద జరిగిన దాడిగా భావిస్తున్నామని సీజే గవాయి దళితుడు కాబట్టే తను ఉన్నత స్థానంలో కూర్చోవడాన్ని ఓర్వలేని ఆదిపత్య శక్తులే దాడికి దిగుతున్నారని, ఈ ఘటనను సుమోటోగా స్వీకరించి క్రిమినల్ కేసులు బుక్ చేసి అత్యంత కఠినంగా శిక్షించాలని ఇలాంటి ఘటనలు మరల పునరావతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని చూడాలని డిమాండ్ చేశారు.ఈ ఈ కార్యక్రమంలో పోతురాజు యాదయ్య మాదిగ,నాన్నగారి రాంచందర్ మాదిగ,లింగని కృష్ణ మాదిగ,శ్యామల జగదీశ్వర్(జ్యోతి అన్న), పోయిల జీవన్ దాస్,మంగలారం శ్రీనివాస్, శ్యామల గంగాధర్,గోల్కొండ రాజు కుమార్, ఎడ్లకాడి సూర్యం,వీర్లపల్లి నవీన్,ఎ. మహేందర్, లేవిరాజ్, నాని, చంద్ర శేకర్,జోగి శ్రీనివాస్, జోగి శేఖర్, అనిల్ కుమార్,ఎ. బాబురావు, వెంకటరమణ, నరేష్, నవీన్, కరన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

అత్తాపూర్ అక్టోబరు 17, ప్రభాతవార్త : రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరికి జీవితంలో వెలుగులు నింపాలని పలువురు ప్రొఫెసర్లు పేర్కొన్నారు. శుక్ర వారం రాజేంద్రనగర్ పివి నరసింహ పశువైద్య కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పివి నరసింహ రావు మెమోరియల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి డిన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆఫ్టైర్స్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. పశువైద్య కళాశాల అసోసియేట్ డిన్ ప్రొఫెసర్ మాధురి అధ్యక్షత వహించారు. ఈ శిబిరంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది విరివిగా పాల్గొని రక్తదానం చేసి సేవ భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం ప్రొగ్రామ్ ఆఫీసర్స్ ప్రొ రామచంద్ర రెడ్డి,ప్రొ అమృత్ కుమార్, ప్రొ అమరేశ్వరి డా.కవిత, ప్రొ సుజాత సింగ్,పివి నరసింహ రావు మెమోరియల్ ట్రస్ట్ సిబ్బంది, చైతన్య,అనిత, తదితరులు పాల్గొన్నారు.

బిసి బంద్‌కు సంపూర్ణ మద్దతు

-డివిజన్ బిజెపి అధ్యక్షుడు సుల్గే వెంకటేష్

అత్తాపూర్ అక్టోబరు17, ప్రభాతవార్త : బిసి బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని బంద్‌ను విజయవంతం చేయాలని అత్తాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు సుల్గే వెంకటేష్ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ....నేడు (శనివారం) తెలంగాణ బంద్ నిర్వహిస్తున్న బీసీ సంఘాలకు బిజెపి తరపు నుంచి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని అదేవిధంగా బస్ డిపోలు, విద్యాసంస్థలు, వాణిజశాస్తులు, అన్ని స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయ వంతంచేయాలని పిలుపునిచ్చారు. బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేస్తుందని బిసి సత్తా చాటిచెప్పాలన్నారు.

గవాయిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే శిక్షించాలి

సంజీవరెడ్డి నగర్,అక్టోబర్ 17 ప్రభాతవార్త: సుప్రీం కోర్టు ఛీఫ్ జస్టిస్ బిఆర్.గవాయి మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని, దాని వెన్న శక్తులను గుర్తించి వారి కూడా శిక్షలు పడేలా దర్యాప్తు చేయాలని, అందు కోసం సుప్రీం కోర్టులో ప్రజా స్వామిక వాధులుగా గుర్తించబడ్డ సీనియర్ జెడ్జీలతో విచారణ జరిపించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని పద్మాశ్రీ అవార్డు అవార్డు గ్రహిత మంద క్రిష్ణ మాదిగ అదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి,జుబ్లీ హిల్స్ ఇన్‌ఛార్జి మునిరాతి మాదిగ అధ్వర్యంలో ఖైరతాబాద్ తహశీ ల్దార్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్లె నర్సింగ్ రావ్ మాదిగ, ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.శివ మాదిగ, బి.కుమార్ మాదిగ, కో ఇన్‌ఛార్జి ములుగు హేందర్ మాదిగ, చిట్యాల అనంద్ మాదిగ, నర్సింగ్ శేఖర్,బాను,అశోక్, కార్తీక్, ప్రేమ్ కిరణ్,చిన్నా, లక్ష్మణ్, సురేశ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక

- ముందుగానే పేరు రాసి ఇచ్చిన పత్రంపై ఓటుహక్కు వినియోగించుకున్న నేతలు

నార్సింగి, అక్టోబర్ 17 ప్రభాతవార్త : గండిపేట మండ లం మంచిరేవులలోని కేఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపిక కోసం రాజేంద్రనగర్ నియోజకవర్గం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. పరిశీలకుడు వేదికపై కూర్చున్న సమయం లోనే కొంత మంది సీనియర్ నేతలు ఓటర్లకు ఓ నేత పేరు రాసున్న స్లిప్పులు పంపిణీ చేశారు. అంటే దానర్థం మీ అంతరాత్మకు విరుద్ధంగా మేము చెప్పిన వారికే ఓట్లు వేయాలని సీనియర్ నేతలు ఓ రకంగా దబాయించారన్న మాట. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులందరి పేర్లు తెలు పకుండా, మీకిష్టమైన అభ్యర్థి పేరు రాసి ఓటు వేయాలని సూచించారు. కొంత మంది తమకు ఇష్టమైన అభ్యర్థి పేరు రాసి ఓట్లేసినా చాలా మందికి ఇచ్చిన స్లిప్పుల్లో ఓ నాయకుడి పేరు ముందే రాసి ఇచ్చి, దానిపైనే ఓట్లు వేసి రావాలని హుకుం జారీ చేశారు. దీంతో తాజా, మాజీ ప్రజా ప్రతినిధులంతా ఇదేమి పద్ధతంటూ గుణుక్కుంటేనే అయిష్టంగా ఓట్లేసి ఫంక్షన్‌హాల్ నుంచి బయటకు వెళ్లా రు.గురువారం జరిగిన ఓటింగ్ సరళిని పరిశీలిస్తుంటే కాంగ్రెస్ పార్టీలో స్వే చ్ఛ ఉందంటూ చేసుకుంటున్న ప్రచారంలో నిజం లేదని, నియంతృత్వం మాత్రమే ఉన్న ట్లు కనిపించింది. ప్రభాత వార్త అక్కడున్న చాలా మంది ఓటర్లను కలిసి వారి వద్ద ఉన్న ఓటరు స్లిప్పులను పరిశీ లిస్తే దానిపై ముందుగానే ఓ పేరు రాసి ఉండడం కనిపిం చింది. ఇదేమిటని ఓటర్లను ప్రశ్నిస్తే బడా నాయకులు ముందుగానే ఎవరికి ఓటేయాలో ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. మరికొంత మంది ఓ నాయకుడి పేరును బాహా టంగానే చెప్పి వెళ్లి ఓట్లు వేశారు. ఓటర్ల ఇష్టాను సారంగా ఓటు వేయకుండా సీనియర్ నేతలు అడ్డుపడ్డట్లు అక్కడి వాతావరణం, ఓటర్ల అభిప్రాయంను బట్టి తెలిసింది.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎంపిక కోసం జరిగిన ఎన్నికల్లో ఓట్లు వేసిన రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజల దృశ్యం

వృద్ధ దంపతులపై దాడి కేసులో కేర్‌టేకర్ అరెస్ట్

ముషీరాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త: ఈనెల 12వ తేదీ దోమలగూడలోని హెరిటేజ్ అపార్ట్‌మెంట్‌లో నివసించే వృద్ధ దంపతులపై దాడిచేసి, బంగారు నగలతో పారిపోయిన కేర్‌టేకర్ గోవర్ధన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో డీసీపీ శిల్పవల్లి వివరాలు వెల్లడించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, మద్యం సేవించటం వంటి దురలవాట్లకు బానిసైన గోవర్ధన్ ఎలాగైనా డబ్బు సంపాదించాలనే దుర్బుద్ధితో తాను పనిచేసే ఇంటి యజమానులైన ఆనందరావు(86), అన్నపూర్ణ(83)లపై దాడిచేసి, వారు స్పృహ కోల్పోవటంతో ఆమె వంటిపై నున్న బంగారు గొలుసు, గాజులు తీసుకుని పారిపోయిన విషయం తెలిసినదే. బాధితుల కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందుకున్న దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేసి, గోవర్ధన్ కోసం గాలింపు ప్రారంభించారు. ఈ క్రమంలో గోవర్ధన్ తన స్వగ్రామం కంకిపాడు వెళ్లి ఉంటాడనే అనుమానంతో స్పెషల్ టీం సాయంతో గోవర్ధన్‌ను పట్టుకుని, అతని నుంచి నగలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పిల్లలు దూరంగా ఉండి, వృద్ధులు ఒంటరిగా ఉండే వారు ఎవరినైనా కేర్ టేకర్లను, పనివాళ్లను పెట్టుకునేటప్పుడు వారి గురించి, పూర్తిగా తెలుసు కోవాలని డీసీపీ సూచించారు. సీనియర్ సిటిజన్స్‌కు ఏదైనా అవసరం అయితే స్థానిక పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. దొంగతనం చేసిన కొద్ది రోజుల్లోనే ఏసీపీ యాదగిరి పర్యవేక్షణలో ఎంతో చాకచక్యంగా నిందితుడిని పట్టుకున్న పోలీస్ సిబ్బంది దోమలగూడ డీఐ సీహెచ్ సుధాకర్, క్రైం ఎస్ఐలు నిరంజన్, శ్రీకాంత్‌లను డీసీపీ అభినందించారు.

బిసి రిజర్వేషన్‌లలో మా వాటా తేల్చండి : గోగికార్ సుధాకర్

హైదరాబాద్,అక్టోబర్ 17,ప్రభాతవార్త: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బిసిలకు ప్రకటిం చిన 42 శాతం రిజర్వేషన్లలో ఎంబిసి కులాల వాటా తేల్చలని ఆయా సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వా న్ని డిమాండ్ చేశారు. దశబ్దాలుగా పాలకుల నిరక్ష్యాన్లికి నిరాదరణకు గురై, రిజర్వేషన్ ఫలితాలు అందుకోలేని స్థితిలో వెనకబడిన కులాలు ఉన్నాయని, ప్రస్తుత ప్రభు త్వం అమలు చెయ్యాలని చూస్తున్న 42శాతం రిజర్వేషన్ల లో ఎంబిసిల జనాభా నిష్పతి ప్రకారం మేమెంతో మాకం త వాటా కేటాయించాలి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో ఎంబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోగికార్ సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన మీడియా సమావేశంలో వివిధ ఎంబిసి కులాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల . బి సి లలో కొన్ని కులాలు మాత్రమే రిజర్వేషన్ ఫలితాలు అందుకుని కొంత మెరుగైన స్థితి లో ఉన్నాయని, ఆర్థిక, సామాజి అత్యధిక జనాభా కలిగిన, అత్యల్ప కులాల మైన మా ఎంబిసి లు ఆర్థిక, సామాజిక రాజకీయ రంగా లలో అణిచివేతకు, నిరక్ష్యాన్లికి, నిరాదరణకు గురై ఉన్న నేపథ్యంలో జనాభా నిష్పత్తి ప్రకారం వాటా తేలాలని అందుకు అధికార, ప్రతిపక్షాలతో పాటు అన్ని రాజకీయ పార్టీలకు సహకరించాలన్నారు. అలాగే 42 శాతం రిజర్వేషన్ ల అంశాన్ని తొమ్మిదివ షెడ్యూల్ లో చేర్చి చట్టభద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే నేడు జరిగే రాష్ట్ర బంద్ కు తమ మద్దతు తెలియాజేశారు.ఈ సమావేశంలో సత్యం జాతీయ అధ్యక్షులు, చింత స్వామి, మోహన్ బైరాగి, గురుచరణ్, జి. జే రాజా, సురేష్, సుమిత్ర, నగేష్, పావని తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న సుధాకర్, సత్యం, స్వామి, మోహన్ తదితరులు

రిజర్వేషన్ల వ్యతిరేకులకు సద్బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్‌కు వినతి

శేరిలింగంపల్లి,అక్టోబర్ 17 ప్రభాతవార్త తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు శేరిలింగంపల్లి బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్ర హం వద్ద బీసీ సంఘాల నాయకులు ఆందోళన చేపట్టా రు. ఈ సందర్భంగా భాతర రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం గా బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్న వ్యతిరేక శక్తులకు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి వినతిపత్రాన్ని జేఏసీ నాయకు లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మాజీ ఛైర్మ న్, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్,మాజీ కో చైర్మన్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, తెలం గాణ బీసీ కులాల సంఘాల జేఏసీ కన్వీనర్, సగర సం ఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర, జేఏపీ నాయ కులు తుడి ప్రవీణ్,మాజీ కౌన్సిలర్ వీరేశం గౌడ్, బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచందర్‌యాదవ్ ,బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌కే సాయన్న ముది రాజ్, బీసీ జేఏపీ నాయకులు ఉప్పల ఏకాంత్ గౌడ్, సగర సంఘం రాష్ట్ర సలహాదారులు కేపీ రామ్‌స గర, సగర సంఘం గ్రేటర్ అధ్యక్షులు మోడల రవి సగర, రా ష్ట్ర ఉపాధ్యక్షులు చిలుక శ్రీనివాస్‌సగర, రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి గంగాధర్, బీసీ జేఏసీ నాయకులు గణేశ్, సీతారం,రామకృష్ణ,ఆశోక్‌యాదవ్; నరషింహా, శంకర్ ముదిరాజ్, బాలరాజు, నారాయణరావు, శివశంక ర్, ఆంజనేయులు, చింతకింది రవీందర్‌గౌడ్, కుమార్ యాదవ్; చెన్నంరాజు ముదిరాజ్, చందు,శివ,రాము, తిరుమల్లేశ్,అడ్వకేట్ రమేశ్, అంజయ్య, మాదవి, భిక్షపతి,వెంకట నర్సింహారావు, రమేశ్ గౌడ్,రాజు ముదిరాజ్, మధుకుమార్, పెద్దసంఖ్యలో బీసీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న బీసి సంఘాల నాయకులు

రన్‌లోపాల్గొన్న డాక్టర్లు సిబ్బంది

వరల్డ్ స్పైన్ ట్రామా డే సందర్భంగా 5కె రన్

హైదరాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త: వరల్డ్ స్పైన్ డే, వరల్డ్ ట్రామా డే సందర్భాలను పురస్కరిం చుకుని అవగాహన సృష్టించేందుకు 5కె వాక్ నిర్వహించారు. ప్రజలకు, ముఖ్యంగా బీద మరియు మధ్యతరగతి వర్గాలకు ఆధునిక వైద్యసేవలను సమానంగా అందించాలనే లక్ష్యంతో ఉదయ్ ఓమ్ని హాస్పిటల్ ఈ వాక్‌ను నిర్వహించింది. శుక్రవా రం ఉదయం నాంపల్లి చాపల్ రోడ్‌లోని ఆసుపత్రి ప్రాంగణం నుంచి ప్రారంభించింది. వాక్‌ను ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ రాఘవ్ దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, ప్రపంచవ్యాప్తంగా సుమారు 80 శాతం మంది వెన్నె ముక సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. రోడ్ల పరిస్థి తి సరిగా లేకపోవడం, దయాబెటీస్, ఊబకాయం, శారీరక వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో ఈ సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఎక్కువసేపు కూర్చోవడం, అలాగే మొబైల్ ఫోన్ వినియోగం అధికం కావడం వల్ల కూడా వెన్నెముక సమస్యలు విస్తరిస్తున్నా యని వివరించారు.ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామం, యోగా, స్విమ్మింగ్, వాకింగ్ వంటి శారీరక కార్యకలాపాలకు కేటాయిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఆయన సూచించా రు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్ ప్రకాష్, డాక్టర్ శ్రీరంగ్ ఆబ్కారి, యూనిట్ హెడ్ ఎం. రాజ్‌కుమార్, డాక్టర్ పవన్‌కు మార్, డాక్టర్ కృష్ణ నారాయణతో పాటు ఇతర వైద్యులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

మాస్టర్ చెఫ్ ఇంట్లో చోరి

జూబ్లీహిల్స్, అక్టోబరు 17, ప్రభాతవార్త: టూత్‌బ్రష్ బాక్స్‌లో తాళంచెవి దాచిపెట్టి విధులకు వెళ్లి వచ్చిన ఒక మాస్టర్ ఛెఫ్ ఇంట్లో చోరి జరిగిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీ హిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణనగర్‌లో నివసించే కర్రి మోహన్‌రావు మాస్టర్ ఛెఫ్‌గా పనిచేస్తున్నారు. ఆయన గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి తాళంచెవులు పక్కనే ఉన్న టూత్‌బ్రష్ బాక్స్‌లో పెట్టి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన అతనికి ముగ్గురు మహిళలు అనుమానస్పదంగా కనిపించారు. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా ఇంట్లో పెట్టి న రూ.60వేల నగదు, 120 గ్రాముల వెండి చోరికి గురైన ట్లు గుర్తించారు.ఈమేరకు ఆయన జూబ్లీ హిల్స్ పోలీసులకు ఫిర్యా దు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సులో దృష్టి మరల్చి గొలుసు చోరీ

జూబ్లీహిల్స్, అక్టోబరు 17, ప్రభాతవార్త: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఒక ప్రయాణికుడిని దృష్టి మరల్చి బంగారు గొలుసు కాజేసిన సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీ సుల కథనం ప్రకారం.. అల్విన్‌కాలనీ ప్రాంతానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి మాలోతు సంతోష్ అల్విన్ కాలనీ నుండి పంజాగుట్టకు వస్తున్న ఆర్టీసీ బస్సులో ఎక్కాడు. పంజాగుట్ట ఎక్స్ రోడ్‌లో కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు అతని దృష్టి మరల్చారు. మాటల్లో పెట్టి అతన్ని తికమకకు గురిచేశారు. అనంతరం సంతోష్ గమనించగా అతని మెడలోని రూ. 24వేల విలువైన 8 గ్రాముల బంగారు గొలుసు కనిపించలే దు. దీంతో సంతోష్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబరు 17, ప్రభాతవార్త: ఒక మహిళ వెంటపడి వేధిస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారా హిల్స్‌లోనివసించే ఒక మహి ళ(40)ను సమీపంలో నివసించే రాంబాబు అనే వ్యక్తి గత రెండు సంవత్సరాలుగా వేధింపులకు, బెదిరింపులకు గురిచేస్తు న్నాడు. ఆమెను వెంబడించడమే కాకుండా అసభ్యకరంగా మా ట్లాడుతున్నాడు. ఈ నెల 15న ఆమె ఇంటి ముందే వేధింపుల కు గురిచేశాడు. సంఘటనపై మహిళ బంజారాహిల్స్ పోలీ సులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిహెచ్ఎంసి గుత్తేదారుపై కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబరు 17, ప్రభాతవార్త: జీహెచ్ఎంసీ గుత్తేదారుపై జల మండలి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బం జారాహిల్స్ పోలీసులు గుత్తే దారుపై కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథ నం ప్రకారం.. జలమండలి తట్టిఖానా సెక్షన్ కార్యాలయ మేనేజర్ రాం బాబు గురు వారం బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని కౌషిక్ సొసైటీ, కనకదుర్గ ఆలయం దారిలో తనిఖీలు నిర్వ హించారు. ఇందులో భాగంగా జలమండలికి చెందిన 100 డయా తాగునీటి పైపులు ధ్వంసం అయినట్లు గుర్తిం చారు. జీహెచ్ఎంసీ గుత్తేదారు అయిన మహ్మద్ ఇమ్రాన్ సీసీ రోడ్డు కటింగ్ పనులు చేపట్టడంతో రెండు ప్రాంతాల్లో పైపులు దెబ్బతిన్నట్లు గుర్తిం చారు. దీంతో 20 మందికి నీటి సరఫరా నిలిచినట్లు అధి కారులు గుర్తించారు. ఈ మేరకు జలమండలి మేనేజర్ రాంబాబు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మహ్మద్ ఇమ్రాన్‌పై బీఎన్ఎస్ 125, 223, 281 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌వైసీ స్వతంత్ర అభ్యర్థి సల్మాన్‌ఖాన్‌పై కేసు నమోదు

జూబ్లీహిల్స్, అక్టోబరు 17, ప్రభాతవార్త: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామి నేషన్ దాఖలు చేసిన హెచ్‌వైసీ పార్టీ నేత సల్మాన్‌ఖాన్‌పై బోరబండ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 15న సల్మాన్‌ఖాన్ తన ప్రసంగంలో మతపరమైన విద్వేషాన్ని ప్రేరేపించే రీతిలో వ్యాక్యలు చేశారు. ఆయా వీడియోను పలు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశా రు.ఇది గుర్తించిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు వీఎస్టీగా నియమితుడైన పవన్‌కుమార్ బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు సల్మాన్‌ఖాన్‌పై బీఎన్ఎస్ 174, 171, 352, 351(3) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT: HYDERABAD

O.A. NO. 174 OF 2025

Between :
ICICI Bank Limited ... Applicant
A N D
M/s. Heleo Polis Developers and Another ...Defendants

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

To,
1. M/s. Heleo Polis Developers, Rep. By Its Partners, F. No. 403, 4th Floor, Srinilaya Residency, Sector-II, B Block, Puppalaguda, Near Sivalayam, Ranga Reddy District-500089, Telangana State ...Defendant No.1
2. Mr. Pachari Srinivas, S/o. P.V. Ramanaiah, Age : Major, Occ. Business, F. No. 403, 4th Floor, Srinilaya Residency, Sector-II, B Block , Puppalaguda, Near Sivalayam, Ranga Reddy District-500089, Telangana State ...Defendant No. 2

Please take the summons in the above O.A. No. 174 of 2025 filed by the Applicant for Recovery of money Rs. 21,07,371.85 Ps. against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA", Rangareddy District Edition newspaper and posted the matter to 19.12.2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-
i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior appro

శబరిమల అయ్యప్ప ఆలయానికి పాదయాత్రగా బయలుదేరుతున్న భక్తులు

శబరిమలకు పాదయాత్ర

శంకర్‌పల్లి, అక్టోబరు 17, ప్రభాతవార్త : శంకర్ పల్లి పట్టణం నుండి శబరిమల అయ్యప్ప స్వామి సన్నిధానం వరకు శుక్రవారం అయ్యప్ప భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన అయ్యప్ప మాలధార భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి బయలుదేరారు. అంతకు ముందు శంకర్ పల్లి విఠలేశ్వర ఆంజనేయ దేవాలయం నుండి శోభాయాత్ర అయ్యప్ప స్వామి దేవాలయం వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు దండు మోహన్, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి, అక్టోబరు 17, ప్రభాతవార్త : మండలంలోని టంగుటూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, గోపులారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు సత్యనారాయణ రెడ్డి, కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువా వేసి ఆహ్వానించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులకు పార్టీలో చేరుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి. రమేష్, యాదిరెడ్డి, వెంకట్రాంరెడ్డి, రామకృష్ణ, జంగయ్య, పాండురంగారెడ్డి, మల్లారెడ్డి, మంకీ బాలయ్య, రేసు పాండు, అంతయ్య, విజయ్ కుమార్, రఘు, తిమ్మారెడ్డి, మైపాల్ రెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త : గ్రామీణ ప్రజలు ఉచిత వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఐజి ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ నాగేశ్వర్రావు, డాక్టర్ ఆనందులకర్ణి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని మన్మర్రిలో ఏఐజి హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. పేదలకు ఉచితంగా లివర్ వైద్య పరీక్షలు చేశారు. గ్రామానికి చెందిన 150 మందికి పైగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు .... పేద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కార్పోరేట్ ఆసుపత్రి మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకు వచ్చిందన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ మాట్లాడుతూ... పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి అవకాశాలు గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వెంకటేష్, సత్యనారాయణ, శ్రీధర్రెడ్డి, నర్సింహులు, అంజనేయులు, రాంచంద్రయ్య, సతీష్, మల్లేష్, వెంకటేష్, బందీశ్వర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు

వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

తెలంగాణ మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి

షాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త : ఉపాధ్యాయులు వెనక బడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలంగాణ మోడల్ స్కూల్ అదనపు సంచాలకులు శ్రీనివాసాచారి అన్నారు. శుక్రవారం తెలంగాణ ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించి, ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టార్, మధ్యాహ్న భోజనం, లైబ్రరీ, లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డిజిటల్ తరగతులను విద్యార్థులకు బోధించే వారు ప్రతిభను పెంచేటట్లుగా కృషి చేసి విద్యార్థుల బంగారు భవిష్యత్కు బాటలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ప్రిన్సిపాల్ రాఘవేందర్, ఏఎంవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాసాచారి

42 శాతం బిసి రిజర్వేషన్‌ను బిజెపి అడ్డుకుంటుంది

దుద్యాల్, అక్టోబరు 17, ప్రభాతవార్త: బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి అడ్డుకుంటుందని, న్యాయం జరిగే వరకు పోరాటాలు ఆపమని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరాస్తాలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ నివేదికను పరిశీలించకుండా, ఆమోదించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. బిసిలకు అన్యాయం జరుగుతుంటే చూసుకుంటూ ఊరుకునేది లేదని, ప్రాణాలకు తెగించి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాదని అరెస్టులు చేస్తే ఉద్యమం మరో స్థాయికి తీసుకెళ్తామన్నారు. బిసి రిజర్వేషన్లు ఆమోదించాలని ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు అన్ని పార్టీలు మద్దతివ్వడంతో పాటు బిజెపీ కూడ మద్దతివ్వడం విడ్డురంగా ఉందన్నారు. కేంద్రంలో బిసి బిల్లు నిలిపివేసి.. రాష్ట్రంలో బిసి బిల్లుకోసం చేపట్టిన బందుకు మద్దతివ్వడం సిగ్గు చేటని పేర్కొన్నారు. నాయకులు, ప్రజలు భారీ ఎత్తున బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లేశం, సురేశ్, ఆశన్న, వెంకటయ్య, రాజు తదితరులు ఉన్నారు.

ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మేడ్చల్‌లో 1890 మద్యం దరఖాస్తులు

రూ.3లక్షలు పెంచటంతోనే తగ్గినట్లు సమాచారం.. చివరి రోజున పెద్ద సంఖ్యలో రావచ్చని ఆశలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబరు 17, ప్రభాతవార్త: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఉన్న మద్యం షాపులకు (టెండర్లకు) ధరఖాస్తుల స్వీకరణకు శనివారం సాయంత్రం వరకు ఉండి గడువు ఒక్క చివరి రోజు మాత్రమే మిగిలింది. ఈ సారి రాష్ట్ర ప్రభుత్వం ధరఖాస్తు ఫీజు రుసుం రూ.3లక్షలకు పెంచటంతో మద్యం వ్యాపారులు అంతగ శ్రద్ధ చూపటం లేదని తెలుస్తుంది. అయితే మేడ్చల్ ఎక్సైజ్ యూనిట్‌లో 118మద్యం షాపులు, మల్కాజ్‌గిరి ఎక్సైజ్ యూనిట్‌లో 88 మద్యం షాపులు ఉండి వీటికి ధరఖాస్తులు స్వీకరించటానికి కేటగిరిలు రిజర్వేషన్లు కూడ ప్రకటించి ధరఖాస్తులు గత నెల 26వ తేదీ నుంచి స్వీకరించటం ఆరంభించింది.

అయితే మేడ్చల్ యూనిట్‌లో 118షాపులకు ఇప్పటి వరకు 1890 ధరఖాస్తులు అందినట్లు, మల్కాజ్‌గిరి యూనిట్ పరిధిలో 88షాపులకు 1932ధరఖాస్తులు అందినట్లు సంబంధిత ఆబ్కారి శాఖ అధికారులు పేర్కొన్నారు. అయితే గతంలో 2023సంవత్సరంలో మద్యం టెండర్లకు మేడ్చల్ యూనిట్‌లో 118షాపులకు 7,519ధరఖాస్తులు రావటం, మల్కాజ్‌గిరి యూనిట్‌లో 6,722ధరఖాస్తులు అందినట్లు ఈ సారి మాత్రం చాలా ధరఖాస్తుల సంఖ్య తగ్గినట్లు, ఇక చివరి రోజు శనివారం దరఖాస్తుల స్వీకరణకు గడువు కావటంతో పెద్ద సంఖ్యలోనే ధరఖాస్తులు రావచ్చని తెలుస్తుంది. దరఖాస్తు రుసుం రూ.3లక్షలకు పెంచటంతోనే అంతగా ఆసక్తి చూపనట్లు తెలుస్తుంది. ధరఖాస్తులను ఈ నెల 23వ తేదీన డ్రా తీయనున్నారు. డ్రాలో ధరఖాస్తులు చేసుకున్న వారిలో షాపు నెంబరు వెళ్లితేనే మద్యం షాపు దక్కుతుందని, డ్రాలో వెళ్లని వారికి రూ.3లక్షల రూపాయలు తిరిగి ఇవ్వటం జరగదన్న విషయం తెలిసిందే. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఫీర్జాదిగూడలో మద్యం షాపులకు ధరఖాస్తులను సంబంధిత ఆబ్కారిశాఖ అధికారులు స్వీకరించటం జరుగుతుంది.

తీరనున్న తాండూరు ప్రజల కష్టాలు

తాండూరు- వికారాబాద్ రోడ్డు పనులు ప్రారంభం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేస్తున్న కృషి మరువలేనిది

ప్రారంభమైన రోడ్డు పనులు

పెద్దేముల్, అక్టోబరు 17, ప్రభాతవార్త: తాండూరు-వికారాబాద్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి, ఖాంజాపూర్ నుంచి రోడ్డు పనులు ప్రారంభం కావడంతోతాండూరు ప్రజల కష్టాలు తీరనున్నాయి. గత పదేళ్ళ బిఆర్ఎస్ పాలనలో రోడ్లు దారుణంగా దెబ్బతిన్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ప్రస్తుత కాంగ్రెస్‌ప్రభుత్వ హయంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో రోడ్డు పనులు ప్రారంభం కావడంతో తాండూరు ప్రజలు, వాహనదారులు అభినందనలు వ్యక్తంచేస్తున్నారు. గుంతలు పడ్డ రోడ్లలో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. అంతేగాకుండా అక్కడక్కడ జరిగిన ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. తాండూరు ప్రజలు పడుతున్న కష్టాలను, అవస్థలను చూసిన ఎమ్మెల్యే రోడ్డు పనులను త్వరితగతిన చేయించేందుకు ఎంతో కృషిచేసారు. ఫలితంగా గురువారం నుంచి రోడ్డు పనులను ప్రారంభించారు.

తండాల అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యం

దుద్యాల్, అక్టోబర్ 17, ప్రభాతవార్త: తండాలు అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని లగచర్ల గ్రామ అధ్యక్షుడు లస్మయ్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పులిచర్లకుంట తండాలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభించారు. లగచర్ల-హకీంపేట్ బీటీ రోడ్డు నుండి తండాకు వెళ్లేందుకు బీటీ మంజూరు కాగా తండాలో మాత్రం సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. దాదాపుగా రూ. 10 లక్షలతో ఈ సీసీ రోడ్డు నిర్మాణ ప నులు చేపట్టినట్లు లక్ష్యయ్య తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

రైతులకు కనీస మద్దతుధర కల్పిస్తున్న ప్రభుత్వం

ఘట్‌కేసర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన వరిధాన్యానికి కనీస మద్దతు ధర కల్పిస్తుందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్, అవుషాపూర్, అంకుశాపూర్, మాదారంలో శుక్రవారం పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి అదికారులు కాంటాలను తూకం వేసి అందుబాటులోకి తెచ్చారు. ఘట్‌కేసర్ సొసైటీ ఆధ్వర్యంలో రైతుల నుంచి ధాన్యం సేకరిస్తామని అధికారులు తెలిపారు. వరిధాన్యం ఏ గ్రేడ్ రకం రూ.2,389లు, సాధారణ రకం రూ.2,369లు చొప్పున ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తుందని సన్నరకం వడ్లు రూ.2,300+రూ.500లు బోనస్ ఇస్తుందని తెలిపారు. రైతులు దళారులను, మిల్లర్లను ఆశ్రయించకుండా ధాన్యం కొనుగోలు కేంద్రంలో తాము పండిన వడ్లను విక్రయించాలని సకాలంలో ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తారని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మేడ్చల్ జిల్లా సహకార అధికారి వెంకట్‌రెడ్డి, డిఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పౌరసరాల సంస్థ మేనేజర్ సుగుణబాయి, మండల వ్యవసాయాధికారి లావణ్య,సింగిరెడ్డి రాంరెడ్డి, ఎండి.రాహుల్‌రాజ్, వైఎస్ చైర్మన్ బద్దం అనంతరెడ్డి, పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్

కిషన్ రావు ఆకస్మిక మరణం

బిజెపికి తీరని లోటు

రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రామచంద్రరావు

మేడ్చల్, అక్టోబర్ 17. ప్రభాతవార్త : మేడ్చల్‌కు చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు డి.వి. కిషన్ రావు గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందడం బీజేపీకి, ముఖ్యంగా మేడ్చల్ కార్యకర్తలకు, ప్రజలకు తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చంద్రరావు, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌లు మేడ్చల్‌కు చేరుకుని కిషన్ రావు పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం రామ్‌చంద్రరావు మాట్లాడుతూకిషన్ రావు పార్టీ పట్ల అంకితభావంతో, క్రమశిక్షణతో పనిచేసిన నాయకుడని, మేడ్చల్‌లో బీజేపీని బలంగా నిలబెట్టిన వీరసైనికుడు ఆయన అన్ని అన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకు ఉన్న తపన అసాధారణమని, బస్ డిపో, పోలీస్ స్టేషన్, ఐటీఐ నిర్మాణం కోసం స్వచ్ఛందంగా భూములు ఇచ్చి ప్రజల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. ఆయన మరణం బీజేపీకి, మాకు అందరికీ తీరని లోటు. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు. అనంతరం ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కిషన్ రావు సాధారణ కార్యకర్తగా మొదలై సీనియర్ నాయకుడిగా ఎదిగారని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందుండేవారని తెలిపారు. ఆయన జీవితం ప్రతి కార్యకర్తకు ఆదర్శమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని దేవుని ప్రార్థిస్తున్నాను అని అన్నారు. అంతిమయాత్రలో మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు పట్లోల్ల విక్రమ్ రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, మేడ్చల్ అసెంబ్లీ బిజెపి కోకన్వీనర్ బోడా శ్రీనివాస్, బిజెపి తెలంగాణ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు కొంపల్లి మోహన్ రెడ్డి, మల్లారెడ్డి, మాజీ కార్యవర్గ సభ్యులు ఎనుగు సుదర్శన్ రెడ్డి, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీధర్ గుప్త, బిజెపి మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు శైలజా హరినాథ్, ఎల్లంపేట్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శులు జకట ప్రేమ్ దాస్, కానుకంటి వంశీ విజయ్ వంజరి, రాష్ట్ర, జిల్లా నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, రామన్నగారి శ్రీనివాస్ గౌడ్, పాతూరి ప్రభాకర్ రెడ్డి, జగన్ గౌడ్, రాగం అర్జున్, లవంగ శ్రీకాంత్, బొజ్జ రాఘవ రెడ్డి, మైసరి రాజు వంజరి, మహిళా మోర్చ నాయకులు హేమలత రెడ్డి, పుష్ప మల్లారెడ్డి, బచ్చు కృష్ణప్రియ మల్లారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ బిజెపి నాయకులు ధాత్రిక లక్ష్మణ్ వంజరి, గౌలికర్ మహేష్, బొజ్జ వంశీ రెడ్డి, పోతుల హరిబాబు రెడ్డి, దోసడీ రామచంద్ర రెడ్డి, కానుకంటి భరత్ వంజరి, శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు

నేడు బిసి బంద్‌కు అంతా సిద్ధం

హక్కుల సాధనకు ఉద్యమించాలని నేతల పిలుపు

కొందుర్గు, అక్టోబరు 17, ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ తో తలపెట్టిన తెలంగాణ బందుకు అందరూ సహకరించాలని మాజీ మండల ప్రాదేశిక సభ్యురాలు బుద్దుల్ మంజుల మల్లేష్ గౌడ్ కోరారు. అందరూ మేధావులు. అన్నీ రాజకీయ పార్టీల నాయకులు,యువజన సంఘాల సభ్యులు,యువకులు వెనుకబడిన తరగతుల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బందును విజయవంతం చెయ్యాలని ఆమె కోరారు. అలాగే అన్ని వ్యాపార సంస్థలు. హోటళ్లు యజమానులు బంద్ కార్యక్రమానికి సహకరించాలని ఆమె కోరారు.

జనాభాలో సగం మేమే : శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి, అక్టోబరు 17, ప్రభాతవార్త: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బిసి కులాలకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తున్నందుకు నిరసనగా శనివారం నాడు నిర్వహించే రాష్ట్ర బిసి బందును ప్రతి ఒక్క బిసి కులస్తుడు పాల్గొని విజయవంతం చేయాలని తలకొండపల్లి మాజీ ఎంపీపీ, గొల్ల కురుమ సంఘం రాష్ట్ర నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో సగభాగమున్న బిసిలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని, బిసిలకు న్యాయంగా రావలసిన 42 రిజర్వేషన్‌ను కోర్టుల ద్వారా కొంతమంది అడ్డుకోవడం దురదృష్టకరమని వాటికి నిరసనగా రాష్ట్రంలోని అన్ని బిసి కులాలు రాష్ట్ర బందులో పాలుపంచుకొని బందును విజయవంతం చేయాలన్నారు.

రేవంత్‌కు చిత్తశుద్ధి లేదు: నరసింహ యాదవ్

కేశంపేట, అక్టోబరు 17 ,ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన బిసిలకు 42శాతం రిజర్వేషన్ హామీ అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు పసుల నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. బిసి రిజర్వేషన్ అమలు చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. శనివారం నిర్వహించే రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందు నిర్వహించాలని అన్నారు.

బంద్‌కు సహకరించండి : పెంటయ్య ముదిరాజ్

కేశంపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త: నేడు నిర్వహించబోయే బంద్‌కు కేశంపేట మండల పరిధిలోని కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ సహకరించండని కేశంపేట మండల కాంగ్రెస్ బిసి కమిటీ అధ్యక్షులు రావుల పెంటయ్య ముదిరాజ్ పిలుపునిస్తూన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిల న్యాయబద్ధమైన 42 శాతం రిజర్వేషన్లను బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అడ్డుకుంటున్నాయని బిసిల రిజర్వేషన్ల పట్ల బిజెపి, బిఆర్ఎస్ ద్వంద వైఖరిని నిరసిస్తూ బిసిల రిజర్వేషన్లపై బిజెపి, మరియు బి ఆర్ ఎస్ డ్రామాలాడుతుందని ఒకవైపు మద్దతు అంటూనే మరోవైపు శాసనసభలో ఆమోదం పొందిన బిల్లులకు ఆమోదం తెలపకుండా బిజెపి పార్టీ బిసిలను మోసం చేస్తుందని అన్నారు.బిసిల 42 రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి,బిఆర్ఎస్‌లపై పోరాడాలని కోరారు.

బిసిలు అంతా ఏకమవ్వాలి

కేశంపేట, అక్టోబరు 17 ,ప్రభాతవార్త: బిసిలకు 42 రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని కేశంపేట మాజీ జడ్పిటిసి పల్లె నర్సింగ్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల కోసం గతంలో కెసిఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం జరిగిందన్నారు. కానీ కొన్ని అనివార్య కారణాలవల్ల బిసిలకు 42 శాతం రిజర్వేషన్ జరగలేదని తెలిపారు. ఇప్పటికైనా బిసిలు అందరూ ఐకమత్యంతో పోరాడి చట్టపరమైన బిసి రిజర్వేషన్లను సాధించుకుందామని, రాజ్యాంగబద్ధంగా 9వ షెడ్యూల్లో చేర్చిన పార్లమెంట్లో బిసి రిజర్వేషన్లకు చట్టాన్ని తెచ్చే విధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిసిలు అంతా ఏకమై రిజర్వేషన్లు సాధించే దిశగా ముందుకు సాగాలని ఆయన అన్నారు, నేడు జరగబోయే బందుకు నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన అన్నారు.

సకల జనులు కలిసి రావాలి

తలకొండపల్లి అక్టోబర్14,ప్రభాత వార్త: రాష్ట్రములో బిసిలు తలపెట్టిన రాష్ట్ర బందును జయప్రదం చేయాలని తలకొండపల్లి మాజీ లీశిశి తీది సంఘం నాయకులు తిరుమని శ్రీశైలం గౌడ్ అన్నారు.శుక్రవారం నాడు తలకొండపల్లి మండల కేంద్రములో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇచ్చినందుకు నిరసనగా 18న నిర్వహించే బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే బంద్‌లో సకల జనులు, తీది కులాలు, రిజర్వేషన్‌కు మద్దతు తెలిపే కుల సంఘంలు పాల్గొని విజయవంతం చెయాలనీ పిలుపు నివ్వడం జరిగింది.తలకొండపల్లి మండల కేంద్రంలో పార్టీలకు అతీతంగా బీసీ బంద్ కు అన్ని కులాల వారు అందరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తీది సంఘం నాయకులు తిరుమని రవి గౌడ్, బాలకుమార్ గౌడ్ తీది రిజర్వేషన్ మద్దతుదారులు మాజీ సర్పంచ్ పెరుమాళ్ళ లలిత జ్యోతయ్య, నూకం వెంకటయ్య, తీది సంఘం నాయకులు మాజీ ఉప సర్పంచ్ పద్మ అనిల్ ముదిరాజ్, దేవేందర్ యాదవ్, శేఖర్ గౌడ్ గార్లు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించాలనటం తగదు

శామీర్‌పేట, అక్టోబరు 17, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం నిర్వహిస్తున్న రాష్ట్ర బిసి బంద్‌ను బిసిలు అందరు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర బిసి కార్మిక సేవా సంఘం అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ రమేశ్‌గౌడ్ పిలుపు నిచ్చారు. శనివారం ఉదయం 8 గంటలకు జరిగే శామీర్‌పేటలోని వైఎస్ఆర్ చౌరస్తా వద్ద రాష్ట్ర బిసి బంద్‌లో అన్ని పార్టీల నాయకులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. బిసిలకు ప్రభుత్వం రిజర్వేషన్లు 42శాతం కల్పిస్తూ జిఓ 9జారీ చేయటం, హైకోర్టు స్టే ఇవ్వటం, దీన్ని సుప్రీంకోర్టు కొట్టి వేసి పాత పద్ధతిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సూచించటం పట్ల బిసి వర్గాలను తీవ్ర ఆందోళనకు గురిచేసిందన్నారు.

బంద్‌కు కాంగ్రెస్ సంఘీభావం

తాండూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల సాధనకై ఈ నెల 18న శనివారం బీసీ ఐక్యవేధిక ఆధ్వర్యంలో చేపట్టిన బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సూచనల మేరకు తాండూరు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌ది కపట ప్రేమే : శుభప్రద్‌పటేల్

వికారాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమం మాదిరి బీసీ రిజర్వేషన్ ఉద్యమం జరగాలని, అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కను విప్పు కలుగుతుందని బీసీ కమీషన్ మాజీ సభ్యులు ఎన్.శుభప్రద్‌పటేల్ ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం నాటి నుంచి నేటి వరకు బీసీలపై కపట ప్రేమ చూపుతుందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై 1980 లో మండల్ కమీషన్ నివేధిక ఇస్తే..దాన్ని వ్యతిరేకించింది స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ కాదా అని ప్రశ్నించారు. నెహ్రూ కాలం నుంచి సోనియా వరకు బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది కాంగ్రెస్ వారేనని ఆరోపించారు.

బిసి ఉద్యమానికి సిద్ధం కావాలి

కొడంగల్,అక్టోబర్ 17ప్రభాతవార్త : తెలంగాణా రాష్ట్రంలో మరో బీసీ ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాల్సిన సమయం అసన్నమైందని మాజీ ఎంపీపీ పటేల్ విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కొడంగల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ ఐక్య కార్యచరణ కమిటీ బీసీ బంధ్ ఫర్ జస్టీస్ 18న శనివారం నాడు తలపెట్టిన బంద్‌ను అన్ని రాజకీయ పార్టీల నాయకులు,ప్రజా సంఘాల నాయకులు కుల సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి బంధ్‌ను విజయ

బాధితులకు ఫుడ్ కమిషన్ చైర్మన్ పరామర్శ

తలకొండపల్లి, అక్టోబరు 17 ,ప్రభాతవార్త : కల్వకుర్తి నియోజకవర్గం లోన్పి వెల్దండ మండల పరిధిలోని గట్టు తాండాకి చెందిన మాజీ సర్పంచ్ పత్య నాయక్, చెరుకూరు గ్రామానికి చెందిన శీనులు రోడ్డు ప్రమాదానికి గురై గాయాల పాలయ్యారు. శుక్రవారం వెల్దండ సమీపంలోని యెన్నం ఆసుపత్రిలో చికిత్స జరుపుతుండడం విషయం తెలుసుకున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి గాయపడ్డ వారిని పరామర్శించారు. గాయపడ్డ ఇద్దరు నాయకులు ద్విచక్ర వాహనం పై కిందపడి గాయాల గురయ్యారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఆయన సూచించారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం 10,000 వేల రూపాయలు వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగల్ విండో డైరెక్టర్ నాగులునాయక్, మాజీ ఎంపిటిసి లు భీమయ్యగౌడ్ ,నిరంజన్ మాజీ ఉపసర్ప నరసింహ శీను మైసయ్య సత్యము గొడుగు యాదయ్య కొండల్ యాదవ్ వెంకటయ్య ఆలీ ఆనంద్ జంగయ్య రామచంద్రయ్య గణేష్ చెరక కొండలు తదితరులున్నారు.

బాధితులను పరామర్శిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

డిజిపిని కలిసిన గుజ్జుల మహేష్

తలకొండపల్లి, అక్టోబరు 17 ,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర డిజిపి శివధర్‌రెడ్డిని శుక్రవారంనాడు తలకొండపల్లి మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జుల మహేష్ కలిశారు. నూతనంగా పదవి చేపట్టిన డిజిపి శివధర్ రెడ్డిని శాలువా బొకేతో సన్మానించి మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డిని కలిసిన గుజ్జుల మహేష్

సుప్రీంకోర్టు జడ్జిపై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

దాడికి ఎమ్మార్పీఎస్ నిరసన

తలకొండపల్లి, అక్టోబరు 17 ,ప్రభాతవార్త: భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు జడ్జిగా వ్యవహరిస్తున్న బి.ఆర్ గవాయిపై దాడి చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణ మాదిగఆధ్వర్యంలో మండలంలోని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ర్యాలీ, ధర్నా నిర్వహించి నిరసన తెలియజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజే గవాయిపై దాడి చేయడం రాజ్యాంగంపై దాడి చేయడమే అంటూ దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకొని చట్టపరంగా శిక్షపడే విధంగా చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతగంటి కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తుడుం శ్రీను, కుమార్ ప్రవీణ్ నారాయణ రాజు ,గోపాల్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు .

జస్టిస్ పైనే దాడి చేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా

ఎమ్మార్పీఎస్ కేశంపేట్ అధ్యక్షుడు చిర్ర శీను మాదిగ

కేశంపేట, అక్టోబరు 17 ,ప్రభాతవార్త: చీఫ్ జస్టిస్ గవాయి పైన దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం కేశంపేట తహసిల్దార్ టి రాజేందర్ రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించిన ఎమ్మార్పీఎస్ కేశంపేట మండల అధ్యక్షుడు చిర్ర శీను మాదిగ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీఫ్ జస్టిస్ పైనే దాడి చేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందని అలాంటి వ్యక్తులను అరెస్ట్ చేసి కఠినమైన శిక్షను విధించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిర్ర రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు సిలివేరు మల్లయ్య, నర్సింలు, కిష్టయ్య, రామచంద్రయ్య, కృష్ణయ్య, సాయిలు, చిర్ర ప్రభాకర్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అన్నోజిగూడలో విద్యార్థులకు సిపిఆర్‌పై అవగాహన సదస్సు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 17, ప్రభాత వార్త: అత్యవసర సమయంలో సీపీఆర్, 108 సర్వీస్ సేవలను వినియోగించుకోవాలని ఈఎంటీ రమేశ్ అన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సిపిఆర్, 108సేవలపై అవగాహన కల్పిం చారు. ఎమర్జెన్సీ సేవలు, గుండెపోటు, రోడ్డు ప్రమాదాలు, పాము కాటు, గర్భిణీలు 108 అంబులెన్స్ సేవలు వినియోగించుకోవాలని సూ చన చేశారు. గుండెపోటు వచ్చిన ప్పుడు చేపట్టాల్సిన సిపిఆర్ విధానాన్ని పైలట్ భద్రునాయక్ విద్యార్థులకు అవగాహన కల్పించా రు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రతాపరెడ్డి, దాదాపు 270మంది విద్యార్థులు, 108 పైలట్ భద్రునాయక్, ఈఎంటీ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసే విధానాన్ని విద్యార్థులకు వివరిస్తున్న 108 భద్రునాయక్.

జీవిత రక్షణలో తక్షణ చర్య

గుండె జబ్బులపై సిపిఆర్ అవగాహన కార్యక్రమం

కొత్తూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త: జీవిత రక్షణలో తక్షణ చర్య ఎంత ముఖ్యమో ప్రజలకు తెలియజేయడానికి జీవీకే ఈఎంఆర్ఐ ఆధ్వర్యంలో 108 అంబులెన్స్ సిబ్బంది సిపిఆర్ (కార్డియో పల్మనరీ రెసిసిటేషన్) పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కొత్తూరు మండల కేంద్రంలోని దర్గా రోడ్ వద్ద ప్రజలకు గుండె జబ్బు వచ్చినప్పుడు తక్షణ సహాయం అందించే పద్ధతుల గురించి వివరించారు . అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో 108 నిలీగి రాంచంద్రయ్య, పైలట్ మహబూబ్ పాల్గొని సిపిఆర్ ప్రదర్శన కూడా చూపించారు. ప్రజలు చురుకుగా పాల్గొని సిపిఆర్ విధానాన్ని నేర్చుకున్నారు.

సిపిఆర్ చేసే అవగాహన కల్పిస్తున్న జివికే ఈఎంఆర్ఐ సిబ్బంది

గవాయిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు

శామీర్‌పేట, అక్టోబరు 17,ప్రభాతవార్త: శామీర్‌పేట మండల తహసీల్దార్ యాదగిరిరెడ్డికి ఎంఆర్‌పిఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్ వినతిపత్రాన్ని అందజేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయి పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేసి ఆ తరువాత తహసీల్దార్ యాదగిరిరెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు,పద్మశ్రీ మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు మండల తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంఆర్‌పిఎస్ నాయకులు బంగరుగల్ల శంకర్, మేడి ప్రేమ్‌కుమార్, అంతాయిపల్లి మహేశ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ యాదగిరిరెడ్డికి వినతిపత్రం అందజేసిన ఎంఆర్‌పిఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై.అశోక్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కీసర,అక్టోబరు17,ప్రభాతవార్తః 11 కెవి ఫీడర్ వల్ల నేడు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కీసర మండల విద్యుత్ ఏఈ మురళీక్రిష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.నేడు శనివారం రాంపల్లి ఎస్ఎస్ నుండి మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.విద్యుత్ ఉండని ప్రాంతాలు రాంపల్లి పాత గ్రామం,సాహితి హరహర వెంట్యూట్,శుభం ఎన్‌క్లేవ్,జై భవానీ కాలనీ,సాయిబాబా నగర్ కాలనీ,లక్ష్మీనగర్,విఎస్‌టి కాలనీ,అయ్యప్ప

శ్రీబుగ్గ జాతరకు రూ. 30 లక్షల మంజూరు

ఆరుట్ల శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే

మంచాల అక్టోబరు17 ప్రభాతవార్త : మంచాల మండలం లోని ఎల్లమ్మ తండా, బోడకొండ, ఆంబోతుండ గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పాల్గొని శంకుస్థాపనలు చేశారు.అనంతరం ఆరుట్ల గ్రామంలో నవంబర్ నెలలో 15 రోజులు జరిగే శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగవద్దని అధికారులతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమీక్ష నిర్వహించారు. రెండు లక్షల మంది భక్తులు వచ్చే బుగ్గ జాతరకి అన్ని సౌకర్యాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. గత సంవత్సరం చేసిన ఏర్పాట్ల కంటే మరింత సౌకర్యాలు సిద్ధం చేయాలని అన్నారు. జిల్లా పాలనాధికారి సి నారాయణరెడ్డితో మాట్లాడి 30 లక్షల తక్షణ నిధులను జారీ చేయించానని తెలిపారు. మరింత నిధుల ఏర్పాటులో అవసరమైతే సమకూరుస్తానని అన్నారు. 15 రోజులు జరిగే ఈ జాతరలో తాగునీటికి ఎలాంటి అసౌకర్యాలు కలగొద్దని చెప్పారు. ఆరుట్ల గ్రామం నుండి రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే నూతన రోడ్డుకై ఒక కోటి ఐదు లక్షలతో తక్షణమే పనులు ప్రారంభించాలని పంచాయతీరాజ్, రోడ్డు,భవనాల అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఈ ప్రభుత్వ సమావేశానికి రాకపోవడాన్ని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి కే.బాల శంకర్, ఆర్డీవో అనంతరెడ్డి, ఎ.సి.పి కెవిపి రాజు,ఎమ్మార్వో వెంకట ప్రసాద్ రావు, మంచాల పి.ఎ.సిఎస్ చైర్మన్ వెదిరె హనుమత్ రెడ్డి,దేవాదాయ శాఖ అధికారులు,వ్యవసాయ శాఖ అధికారులు, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

రైతులకు 75శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాలు పంపిణీ

మంచాల అక్టోబరు 17 ప్రభాతవార్త : మంచాల మండలం ఆరుట్ల చిత్తాపూర్ తాళ్ల పల్లి గూడా లోని 79 మంది రైతులకు బ్రష్ కట్టర్స్ ,పవర్ విడర్స్ (కలుపు తీసే యంత్రం) పెట్రోల్ పిచికారి, బ్యాటరీ పిచికారి, కట్టర్స్‌ను మంచాల మండల కార్యాలయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరిణీ చేశారు. ఈ కార్యక్రమలో వాటర్ షెడ్ అధికారి సంధ్య, మహేష్ , పలువురు మాజీ ప్రజా ప్రతినిధులుపాల్గొన్నారు.

రైతులకు వ్యవసార పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఇండ్లపై వేలాడిన హై టెన్షన్ తీగలు తొలగింపు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు

నందిగామ, అక్టోబరు 17 ప్రభాతవార్త : నందిగామ మండల కేంద్రంలో 7,8,9 వార్డుల్లో ప్రమాదకరంగా ఇండ్లపై వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లను షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక చొరవతో హైటెన్షన్ వైర్లను శుక్రవారం విద్యుత్ ఏడి రవీందర్, కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డిల సమక్షంలో విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నారు. ఇండ్లపై వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లను తొలగించి కొత్త స్తంభాలు వేసి పునరుద్ధరించారు. ఎన్నో ఏళ్లుగా హైటెన్షన్ విద్యుత్ వైర్లతో భయం భయంగా గడిపిన కాలనీవాసులకు విద్యుత్ తీగల గ్రహణం వీడడంతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, చించేటి కృష్ణ, టైలర్ కృష్ణ, చించేటి శివ గౌడ్, బి లింగం గౌడ్, ఎర్రగారి రమేష్, చేన్నగళ్ళ నరసింహులు, ఏపూరి ఆనందం, తడకల జంగయ్య తదితరులు ఉన్నారు.

నందిగామలో విద్యుత్ వైర్లను పునరుద్ధరిస్తున్న కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

మహిళలకు రక్షణ కవచం షీ టీం

- బూర్గుల కంపెనీలలో వర్కర్లకు సమగ్ర అవగాహన కల్పించిన షీ టీం బృందం

అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

షాద్‌నగర్ రూరల్, అక్టోంబరు 17, (ప్రభాత వార్త) : మహిళలకు అండగా ఎప్పుడూ ముందుంటున్న షీ టీం బృందం తాజాగా రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్ మండలం బూర్గుల సమీపంలోని కంపెనీల్లో పనిచేస్తున్న వర్కర్స్‌కు సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది.సైబరాబాద్ డీసీపీ సృజన ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఇన్‌స్పెక్టర్ హనుమగౌడ్ ఆధ్వర్యంలో షీ టీం సభ్యులు సురేష్ గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సంధ్య, వెంకటేష్, ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జితేందర్‌రెడ్డిలు కార్మికులకు రక్షణ చట్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో మహిళలపై దాడి చేయడం, వేధింపులు, వాటిని ఎదుర్కొనే విధానాల గురించి వివరించారు. అలాగే బాల్య దుర్వినియోగం, బాల్య వివాహాలు వంటి సామాజిక సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యల్లో ఉన్న మహిళలు, పిల్లలు ఎలాంటి సంకోచం లేకుండా సంప్రదించడానికి వీలుగా ముఖ్యమైన హెల్ప్‌లైన్ నెంబర్లను టీం సభ్యులు వారికి తెలియజేశారు. డయల్ 100, బాలల హెల్ప్‌లైన్ నెం. 1098, సైబర్ క్రైమ్ నెం. 1930, హెచ్ఐయాప్ వినియోగంపై కూడా అవగాహన కల్పించారు. మహిళల అక్రమ రవాణా గురించి, దానిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సోషల్ మీడియాలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, ఆన్‌లైన్ మోసాలు, వాటి నుండి రక్షణ కోసం తెలియని వ్యక్తుల నుండి రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వారికి వివరించారు. షీ టీం సేవలతో పాటు, బాధిత మహిళలకు కౌన్సిలింగ్ అందించే భరోసా కౌన్సిలింగ్ కేంద్రం సేవలు, కనిపించకుండా పోయిన పిల్లలను కనుగొనే స్మైల్ టీం పాత్ర గురించి కూడా వారికి తెలిసేలా వివరించారు. పిల్లలపైనా కుటుంబం మొత్తంపైనా తల్లిదండ్రుల బాధ్యత గురించి, ముఖ్యంగా పిల్లల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి షీ టీం సభ్యులు ప్రత్యేకంగా తెలిపారు. అంతేకాకుండా, దైనందిన జీవితంలో ముఖ్యమైన ట్రాఫిక్ నిబంధనలు గురించి, సాంకేతిక అంశాలలో క్యూఆర్ కోడ్ వినియోగం గురించి, ఇతర అంశాలపై పూర్తి అవగాహన కల్పించి వారిని చైతన్యపరిచారు. మహిళా కార్మికులకు షీ టీం బృందం అందించిన సమగ్ర సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుందని కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కంపెనీ సిబ్బందితో పాటు షీ టీం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన పెంచుకోవాలి

స్టేషన్‌ఫైర్ అధికారి సేవ్యానాయక్

దోమ,అక్టోబరు 17 ప్రభాతవార్త: విద్యార్థులందరు ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా స్టేషన్‌ఫైర్‌అదికారి సేవ్యానాయక్ అన్నారు.అగ్ని ప్రమాదాల నివారణకై శుక్రవారం నాడు దోమ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భముగ ఆయన మాట్లాడుతూ ప్రమాదాలకు నాలుగు రకాల వర్గీకరణగా గుర్తించడము జరుగుతుందని తెలిపారు.ముఖ్యంగా ఇంట్లో వాడే గ్యాస్ సిలిండర్‌లులికేజి కారనంగా గ్యాస్ ఇంట్లో మొత్తం వ్యాప్తి చెంది ఇల్లు దగ్ధం అయ్యె ప్రమాదం ఉంటుందని అన్నారు.అలాంటి సమయములో వెంటనే తడిగుడ్డతో సిలిండర్‌పై వేస్తె మంటలు ఆర్పెయవచ్చని తెలిపారు.ప్రమాదాలనివారణకై విద్యార్థులకు నాలుగు విదాలుగా ప్రదర్శి అవగాహన కల్పించారు.కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మి మాట్లాడుతూ ఈలాంటి అవగాహన సదస్సుల ద్వారా విద్యార్థులు నేర్చుకొని మీ గ్రామ పరిసరాల్లోజరిగే ప్రమాదాలను నివారించుకోని మీ తల్లితండ్రులకు తెలుపాలని సూచించారు.క్షణాల్లో జరిగే ప్రమాదాలుకుటుంబం చిన్నాబిన్నం అవుతుందని అన్నారు.ప్రమాదాల నివారనకై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నఅగ్నిమాపక సిబ్బందికి దన్యవాదములు తెలిపారు.ఈ కార్యక్రమములో పరిగి అగ్నిమాపక సిబ్బంది చంద్రమోహన్,పాండురంగం,వెంకటేశం,మొగులయ్య,వెంకటయ్య,కళాశాల సిబ్బంది రాధా,శ్రీవిద్య,రాములు, లక్ష్మయ్య ,మదుసుదన్,శ్రీదర్‌కుమార్,సువర్ణ,సానియా సుల్తానా ,శ్రీకాంత్ ,చంద్రశేఖర్‌రెడ్డి,బంద్యనాయక్,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సేవ్యానాయక్

లక్ష్మణ్ కుమార్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తా ; ఎమ్మెల్యే



లక్ష్మణ్ కుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్, అక్టోబరు 17, ప్రభాతవార్త : యువసత యూత్ కన్వీనర్ లక్ష్మణ్ కుమార్ న్యూరో సమస్యతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఆయనను ఆసుపత్రిలో పరామర్శించారు. లక్ష్మణ్ కుమార్ కు బ్రెయిన్ స్ట్రోక్ కు సంబంధించి ఆసుపత్రి వైద్య వర్గాలను అడిగి తెలుసుకున్నారు. చిన్న వయసులో ఎంతో కష్టపడి ప్రజా ఉద్యమకారుడుగా ముఖ్యంగా ఆపదలో ఉన్న వారిని ఆదుకొనడంలో లక్ష్మణ్ కుమార్ సత్తా వేరేనని అలాంటి వ్యక్తి ఇప్పుడు ఆపదలో ఉన్నాడని తెలియడం చాలా బాధాకరంగా ఉందని అన్నారు. లక్ష్మణ్ కుమార్‌కు ప్రభుత్వం తరపున అదే విధంగా తాను కూడా పూర్తి సహాయ సహకారాలు అందించి అతను ఆరోగ్యంగా ఉండేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. స్థానిక వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని సమీక్షి ంచారు. ఇలాంటి ప్రమాదం లేదని త్వరలోనే కోలుకుంటారని ఆసుపత్రి వైద్యులు చెప్పారు. ఏదన్నా వైద్య సాయం ఇతర విషయాల పరంగా ఏ అవసరం వచ్చిన తనని సంప్రదించాలని ఆసుపత్రి వర్గాలను ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు జంగా నరసింహా యాదవ్, చెంది తిరుపతి రెడ్డి బాలరాజు గౌడ్ కేకే కృష్ణ, పురుషోత్తం రెడ్డి, సుదర్శన్ గౌడ్, ముబారక్ అలీ ఖాన్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రోడ్డు పక్కన మట్టిపోయిస్తున్న నాయకులు

బిటి రోడ్డుకు మరమ్మతులు

జిల్లేడు చౌదరిగూడెం,అక్టోబరు ,17 (ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహాడ్ నుంచి జాకారం వరకు ఉన్న బీటి రోడ్డును కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మరమ్మత్తులు చేశారు. గత కొన్ని రోజుల కిందట కురిసిన వర్షానికి రోడ్డు పక్కన గుంతలు ఏర్పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని స్థానికి నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి తీసుకువెల్లారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రొడ్డు మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు. ఈ మెరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరమ్మత్తు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపిటిసి సత్యనారాయణరెడ్డి, మాజి సర్పంచ్ శివమౌళి, జగన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, రాధకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన మండల అధ్యక్షుడు

జిల్లేడు చౌదరిగూడెం,అక్టోబరు ,17 (ప్రభాతవార్త): కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో ముగ్గురు పిల్లల నిబందనను తొలగిస్తున్నట్లు ప్రకటించడం పట్ల ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను శుక్రవారం సన్మానించారు. గ్రామాలలో పోటి ఎన్నికలలో పోటి చేసేందుకు ఉత్సహం ఉన్నవారికి ముగ్గురు పిల్లలు ఉండడం వల్లన కొంత ఇబ్బందులు పడ్డారని ఆయన అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ నిబందనను తొలగించడం వల్లన ఎంతో మందికి ఎన్నికలలో పోటి చేసేందుకు అవకాశం వచ్చిందని ఆయన పెర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు

మహిళా శక్తి దిశగా మరో అడుగు

ఉచిత కుట్టుమిషన్ శిక్షణ

కొత్తూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త; కొత్తూరు మండలంలో జన శిక్షణ సంస్థాన్ రంగారెడ్డి జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఏంట్రాపూన్యూర్ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం మరియు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సంస్థ కొత్తూర్ మున్సిపల్ మరియు మండలంలోని గ్రామాలలో ఉచిత కుట్టు మిషన్ నేర్పించడం జరిగింది. ఈ ఉచిత కుట్టు మిషన్ కోర్సు 80 రోజుల కోర్సు దీనిలో 40 మంది మహిళలు కుట్టుమిషన్ నేర్చకోవడం, కుట్టు మిషన్ నేర్చుకున్న వారికి శుక్రవారం. పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ పరీక్ష కేంద్రంలో ముఖ్య నాయకులు డైరెక్టర్ రామ్మోహన్ రావు , కౌన్సిలర్ హేమ దేవెందర్ ముదిరాజ్. కౌన్సిలర్ మాధవరం నరసింహా గౌడ్, స్థానికులు జనార్దన్ రెడ్డి పేపర్ యాదయ్య పాల్గొన్నారు. మహిళలకు శిక్షణ ఇచ్చినవారు గీత మహిళలకు శిక్షణ ఇచ్చారు.

శిక్షణలో పాల్గొన్న నాయకులు, మహిళలు

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి అక్టోబరు 17,ప్రభాత వార్త: తలకొండపల్లి మండలంలోని దేవునిపడకల్ గ్రామానికి చెందిన కాడమోని గంగమ్మ (58), శుక్రవారం ఉదయం మృతి చెందారు .ఈ విషయంతెలుసుకున్న ,తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా బాధిత కుటుంబానికి సహాయముఅందజేశారు. ఈ విషయాన్ని తలకొండపల్లి తీళిళీ పార్టీ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్ ద్వార తెలుసుకొని స్థానిక స్పందించి తక్షణమే 3000/ రూపాయలు తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన తో పాటుదేవునిపడకల్ వాలీబాల్ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరి మల్లేష్ గారు తనవంతుగా 3000/ అందించారు, ఈ కార్యక్రమంలో గ్, ,, తదితరులు పాల్గొన్నారు. తీళిళీ గ్రామ అధ్యక్షులు అంబటి రమేష్. అంబటి లింగయ్య. మాజీ సర్పంచ్ శంకర్ నాయక్. అంబటి లక్షమయ్య. అంబటి వెంకటేష్. అంబటి జంగయ్య. గుంటి గౌరీశంకర్. కడమోని నర్సింహా. మరియు గ్రామ నాయకులు కలిసి కుటుంబ సభ్యులకు అందజేశారు .

కెవిసిఎస్‌లో వైభవంగా దీపావళి సంబురాలు

తాండూరు, అక్టోబరు 17, ప్రభాతవార్త : తాండూరు పట్టణంలోని కృష్ణవేణి కాన్సెప్ట్ స్కూల్‌లో ముందస్తుగా దీపావళి సంబరాలను వైభవంగా జరుపుకొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్ర